ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
తమిళనాడు
TAMILNADU
శనివారం 7 డిసెంబరు 2024



కొడనాడు ఎస్టేట్ కేసుల వ్యవహారం...

ఈపీఎస్, శశికళను విచారించేందుకు

హైకోర్టు అనుమతి

చెన్నై, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొడనాడు హత్య, దోపిడీ కేసుల్లో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్), మాజీ ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు శశికళను విచారణ జరిపేందుకు మద్రాసు హైకోర్టు అనుమతిచ్చింది. జయ వేసవి విడిది కేంద్రమైన కొడనాడు ఎస్టేట్ వద్ద 2017 ఏప్రిల్ 23న గుర్తు తెలియని వ్యక్తులు దోపిడీ యత్నానికి పాల్పడి, అక్కడి వాచ్‌మెన్ ఓంబహదూర్‌ను హతమార్చారు. ఆ తర్వాత ఎస్టేట్‌లోని భవనాల్లో భద్రపరచిన దస్తావేజులను, విలువైన నగలు, నగదు కూడా అపహరించుకెళ్ళారు. ఈ మేరకు సోలూరుమట్టం పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఈపీఎస్, శశికళ తదితరులను విచారించేందుకు అనుమతివ్వాలంటూ నిందితులు దీపు, సతీషన్, సంతోష్‌స్వామి తదితరులు నీలగిరి కోర్టులో పిటిషన్ వేశారు. నీలగిరి జిల్లా సెషన్స్ కోర్టు ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఆ కోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ మద్రాసు హైకోర్టులో దీపు తదితరులు పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై న్యాయమూర్తి వేల్‌మురుగన్ ఇటీవల విచారణ జరిపారు. కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన హత్య, దోపిడీ సంఘటనల పై ఉన్నతస్థాయి విచారణ జరుగుతోందని ప్రభుత్వ తరఫు న్యాయవాది వినోద్‌కుమార్ తెలిపారు. ఆ నేపథ్యంలో ఈపీఎస్ ప్రస్తుతం ముఖ్యమంత్రి పదవిలో లేరు గనుక అతడిని ఎందుకు విచారించకూడదని న్యాయమూర్తి ప్రశ్నించారు. అనంతరం తీర్పు వెలువరించే తేదీ ప్రకటించకుండా విచారణ వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో నీలగిరి కోర్టు ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు న్యాయమూర్తి వేల్‌మురుగన్ శుక్రవారం ప్రకటించారు. అదే సమయంలో ఈపీఎస్, శశికళ తదితరులను విచారించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేస్తూ.. వారి వద్ద విచారణ జరిపేందుకు అనుమతి ఇస్తున్నట్లు పేర్కొన్నారు.





ఎగ్మూరు రాజరత్తినం స్టేడియంలో మురుగునీటి తొలగింపు వాహనాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

తమిళనాట మతపార్టీలు

చెల్లవు

సమ సమాజమే మా ఆశయం ● సీఎం స్టాలిన్

చెన్నై, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమ సమాజ స్థాపనే తమ ప్రభుత్వ ఆశయమని, ద్రవిడ ఉద్యమ నేత పెరియార్, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను నిరంతరం ఆరాధించే తమిళనాట మతతత్త్వ పార్టీల కుయుక్తులు ఫలించబోవని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ఎగ్మూరులోని రాజరత్తినం స్టేడియంలో శుక్రవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మార్చే దిశగా వారికి మురుగునీటి తొలగింపు వాహనాలను పంపిణీ చేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద సుగాలీలు తదితర లబ్ధిదారులకు సహాయాలు అందజేశారు. ఆ సందర్భంగా సభలో సీఎం మాట్లాడుతూ... ద్రవిడ ఉద్యమనేత పెరియార్ తన ప్రసంగాల్లో తరచూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కరే తాను ఎల్లప్పుడూ ఆరాధించే నాయకుడని కీర్తించారని, సమాజాభివృద్ధి కోసం, మూఢాచారాలకు వ్యతిరేకంగా తాను చెప్పదలచిన సూచనలన్నీ ఆయన ఎప్పుడో చెప్పారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి రాష్ట్ర ప్రజలంతా ఎల్లప్పుడూ అంబేడ్కర్‌ను గుర్తుంచుకునేలా 1972లో దేశంలోనే మొట్టమొదటి అంబేడ్కర్ పేరిట ప్రభుత్వ కళాశాల, 1989లో చెన్నైలోని న్యాయకళాశాలకు అంబేడ్కర్ పేరు, 1990లో అంబేడ్కర్ శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం, అంబేడ్కర్ జీవిత విశేషాలతో నిర్మించే బయోపిక్‌కు ప్రభుత్వం తరఫున రూ.10లక్షల నగదు పురస్కారం ప్రకటించడం వంటి ఎన్నో కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారని గుర్తు చేశారు. అంతే కాకుండా మద్రాసు హైకోర్టు ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుచేసి, నగరంలో స్మారక మండపం కూడా నిర్మించారని తెలిపారు. కరుణానిధి చూపినబాటలోనే అంబేడ్కర్ ప్రతిపాదించిన సమ సమాజ స్థాపన దిశగా డీఎంకే ప్రభుత్వం ముందుకు వెళ్తోందని చెప్పారు. ద్రావిడ తరహా డీఎంకే ప్రభుత్వం అంబేడ్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 14వ తేదీని 'సమానత్వం దినంగా' ప్రకటించిందన్నారు. డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ కోరిక మేరకు అంబేడ్కర్ స్మారక మండపంలో ఆయన విగ్రహాన్ని కూడా ఏర్పాటుచేశామన్నారు. గత మూడేళ్లలో ఆదిద్రావిడ గిరిజన ప్రజలకు అయోధ్యదాస పండితర్ పేరుతో నివాసగృహాల నిర్మాణ పథకం, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిపనులు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు యేటా 250 కోట్ల మేరకు నిధుల విడుదల, గిరిజన విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం, 479 పాఠశాలల్లో స్మార్ట్ తరగతిగదులు, హైటెక్ ల్యాబ్‌లు, ఆది ద్రావిడ సంక్షేమ పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.100 కోట్ల మేరకు నిధుల విడుదల, సుగాలీలు, వడ్డెర జాతి వారికి 500 గృహాలు నిర్మించడం వంటి ఎన్నో పథకాలను అమలు చేశామని స్టాలిన్ వివరించారు. అదే విధంగా పారిశుధ్య కార్మికులు అని పిలవటం కంటే పరిశుద్ధమైన మనస్సు కలిగినవారని పిలవటమే సముచితంగా ఉంటుందన్నారు. వర్షాలు, వరదలు తదితర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆయా ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టే ఈ కార్మికుల వల్లే తమ ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందన్నారు. పారిశుధ్యకార్మికుల మంచి పథకాలు ఎన్ని చేసినా వారి రుణం తీర్చుకోలేమని స్టాలిన్ ఉద్వేగంగా అన్నారు. పెరియార్, అంబేడ్కర్‌ను నిరంతరం ఆరాధించే తమిళనాట మతతత్త్వ పార్టీల కుయుక్తులు, కులం పేరిట, మతం పేరిట ప్రజల మధ్య చిచ్చుపెట్టడం కుదరదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, రఘుపతి, ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, మదివేందన్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ, కాంగ్రెస్ సభాపక్ష నాయకుడు సెల్వపెరుంతగై, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎన్.మురుగానందం, దళిత్ ఇండియా వాణిజ్య కార్మిక సంఘం వ్యవస్థాపకులు మిలింద్ కాంబ్లే, జాతీయ నాయకుడు రవికుమార్ నర్రా తదితరులు పాల్గొన్నారు.

నేడు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో

కేంద్ర బృందం పర్యటన

● రూ.944.80 కోట్లు విడుదల



చెన్నై విమానాశ్రయంలో దిగిన కేంద్ర కమిటీ సభ్యులు

చెన్నై, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫెంగల్ తుఫాన్ కారణంగా ఆస్తి, పంట, ప్రాణ నష్టం జరిగిన విల్లుపురం, కడలూరు తదితర జిల్లాల్లో శనివారం కేంద్ర బృందం పర్యటించనుంది. తుపాను బాధితులను ఆదుకునేందుకు రూ.2 వేల కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఇదివరకే కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ఫోన్‌లో మాట్లాడినప్పుడు కూడా వీలైనంత త్వరగా కేంద్ర బృందాన్ని పంపి తుఫాన్ నష్టాన్ని అంచనావేసి నిధులు మంజూరు చేయమని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర హోం శాఖ డిప్యూటీ కార్యదర్శి రాజేష్‌గుప్తా నేతృత్వంలోని కేంద్ర పరిశీలన కమిటీ బృందం శుక్రవారం సాయంత్రం నగరానికి విచ్చేశారు. ఈ కమిటీలో పొన్నుసామి, సోనమణి హేబం, శరవణన్, ధనపాలన్ కుమరన్, రాహుల్ పచ్కోడి, బాలాజీ సహా ఎనిమిది మంది ఉన్నారు. ఈ ఎనిమిదిమంది తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో శనివారం నుండి పర్యటించనున్నారు.

కేంద్రం నుంచి నిధుల విడుదల... : ఇదిలా ఉండగా రాష్ట్రంలో ఫెంగల్ తుపాను బాధిత ప్రాంతాల్లో పునరావాస చర్యలు, బాధితులకు సాయం అందించడానికి రూ.944.80 కోట్ల మేర నిధులను కేంద్రం విడుదల చేసింది. జాతీయ విపత్తుల నివారణ నిధి నుండి ఈ నిధులను మంజూరు చేసినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శుక్రవారం రాత్రి ప్రకటించింది.

బాలిక కోరింది ఊరికి బస్సొచ్చింది

● నెరవేర్చిన రవాణా శాఖ



కొత్త బస్సు ప్రారంభించి విద్యార్థిని దర్శినికి స్వీటు తినిపిస్తున్న రవాణా శాఖ మంత్రి శివశంకర్

చెన్నై, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా ఓలక్కూరుకు చెందిన బాలిక కోరిక మేరకు రాష్ట్ర రవాణా శాఖ ఆమె చదువుతున్న పాఠశాలకు కొత్త బస్ సర్వీసును ప్రారంభించింది. విల్లుపురం జిల్లా దిండివనం సమీపం ఓలక్కూరు అమ్మనపాక్కం గ్రామానికి చెందిన రాజశేఖర్, అంకాళమ్మాళ్ దంపతులకు కుమార్తె దర్శిని ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆ బాలిక గత నెల ఓ తమిళ టీవీ ఛానెల్‌లో ప్రసారమైన పాటల పోటీల్లో పాల్గొని ప్రేక్షకుల మన్ననలందుకుంది. ఆ సందర్భంగా దర్శిని మాట్లాడుతూ.. రోజూ అమందమంగళంలో ఉన్న స్కూల్‌కు వెళ్లటానికి బస్ లేక ఇబ్బంది పడుతున్నామని, వీలైతే అమ్మనపాక్కం నుంచి అమందమంగళం వరకు బస్ సదుపాయం కల్పిస్తే చాలా సంతోషిస్తానని పేర్కొంది. ఈ విషయం ముఖ్యమంత్రి స్టాలిన్ దృష్టికి వెళ్లడంతో దర్శిని కోరిక ప్రకారం ఆ రెండు ప్రాంతాల మధ్య బస్‌సర్వీసు నడుపాలని రవాణా శాఖ మంత్రి శివశంకర్‌కు ఆదేశాలిచ్చారు. ఆ ప్రకారం శుక్రవారం ఉదయం బాలిక దర్శిని సమక్షంలో అమ్మనపాక్కం - అమందమంగళం బస్ సర్వీసును ప్రారంభించారు. ఆ తర్వాత దర్శిని, ఆమె చదువుతున్న పాఠశాల విద్యార్థులతో పాటు మంత్రి శివశంకర్ కూడా అమందమంగళం వరకు ప్రయాణించారు. అమందమంగళంలోని స్కూలు వద్ద మంత్రి శివశంకర్ బాలికలను కిందకు దింపి స్కూలులోకి పంపారు. ఈ బస్ సర్వీసుతో విద్యార్థుల కష్టాలు తీరాయని మంత్రికి తెలిపి ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు.

అరుప్పుకోటా.. మదురై సెంట్రలా?

పాగాకు సరైన చోటేది? ● ప్రేమలత సమాలోచనలు



టి.నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే వ్యవస్థాపకులు కెప్టెన్ విజయకాంత్ మృతితో వీస్తున్న సానుభూతిపవనాలను అనుకూలంగా మార్చుకుని ఈ సారి అధిక అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్న ఆయన సతీమణి, ప్రస్తుత పార్టీ అధినేత్రి ప్రేమలత.. అరుప్పుకోట లేదా మదురై సెంట్రల్ నియోజకవర్గాల్లో ఏదో ఒకచోట పోటీ చేయాలని భావిస్తున్నారు. ఆ దిశగా ఆమె సన్నాహాలు ప్రారంభించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు అన్ని పార్టీలు ఇప్పటి నుంచే సన్నాహాల్లోకి దిగాయి. ఆ మేరకు డీఎండీకే కూడా అసెంబ్లీ ఎన్నికల వ్యూహంలో తలమునకలవుతోంది. పార్టీకి ఓటు బ్యాంక్ అధికంగా ఉన్న నియోజకవర్గాల వివరాలను సేకరిస్తున్నారు. అదే సమయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి హోదాలో తానూ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దిగాలని ప్రేమలత నిర్ణయించారు. ఆ దిశగానే పార్టీ జిల్లా కార్యదర్శులు ప్రేమలత పోటీ చేస్తే గెలిచేందుకు అవకాశమున్న నియోజకవర్గాలను ఎంపిక చేసే పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ విషయమై డీఎండీకే సీనియర్ నేతలు కొందరు మాట్లాడుతూ.. ఈ సారి దక్షిణాది జిల్లాల నుంచి ఎక్కువ నియోజకవరాల్లో పార్టీ అభ్యర్థులను పోటీకి దింపాలని ప్రేమలత వ్యూహరచన చేస్తున్నారని చెప్పారు. ఆ దిశగానే కూటమి నాయకత్వం వహిస్తున్న అన్నాడీఎంకే పెద్దలతోనూ చర్చిస్తున్నారని చెప్పారు. గత లోక్‌సభ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపాలైన విరుదునగర్ జిల్లాలోని అరుప్పుకోట సహా రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో, మదురై సెంట్రల్ సహా రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ డీఎండీకే పోటీ చేయడం ఖాయమని చెప్పారు. పార్టీ నాయకురాలు ప్రేమలతను అరుప్పుకోటలో పోటీ చేయాలని ప్రతిపాదిస్తున్నామని, ఒక వేళ ఆ నియోజకవర్గం వద్దనుకుంటే మదురై సెంట్రల్ అసెంబ్లీ నియోకవర్గంలో పోటీకి దిగాలని కూడా సూచించినట్లు పేర్కొన్నారు. కెప్టెన్ తనయుడు విజయ ప్రభాకరన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయరని, మళ్ళీ పార్లమెంట్ ఎన్నికల్లో విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గంలోనే పోటీ చేయాలనే నిర్ణయంలోనే ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ నుంచి ఎన్నికల ఇన్‌చార్జుల జాబితా కూడా సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సారి పార్టీ జిల్లా కార్యదర్శులనే ఎన్నికల ఇన్‌ఛార్జులుగా నియమించే అవకాశముందన్నారు. అంతకంటే ముందు డీఎండీకే వ్యవస్థాపకుడు విజయకాంత్ వర్ధంతి సందర్భంగా చెన్నై నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. ప్రజాసమస్యలపై ఆందోళనలు చేసేందుకు కూడా పార్టీ అధిష్ఠానం తమకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని చెప్పారు. పార్టీలోని ప్రముఖులు జిల్లా శాఖ నాయకులు స్వస్థలాలోనే పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేసుకుని ప్రజావిజ్ఞప్తులను స్వీకరించి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రేమలతా ఆదేశించినట్లు చెప్పారు. ఈ విషయమై డీఎండీకే మదురై సౌత్ జిల్లాశాఖ కార్యదర్శి ముత్తుపట్టి మణికంఠన్ మాట్లాడుతూ కెప్టెన్ మృతి తర్వాత వస్తున్న సానుభూతి పవనాల కారణంగా పార్టీ ప్రతిష్ఠ గతం కన్నా పెరిగిందని చెప్పారు. 2026 అసెంబ్లీ ఎన్నికలు తమ పార్టీకి చక్కటి మలుపు కలిగిస్తుందని కూడా ధీమా వ్యక్తంచేశారు. ఆ ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధించటమే కాకుండా ఈ సారి ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్రను పోషించడం తథ్యమని కూడా చెప్పారు.

పోరూర్ చెరువులో సేల్స్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ శవం

హత్యా? ఆత్మహత్యా?



సెంథిల్ వేల్ (ఫైల్‌ఫొటో)

అడయార్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్ చెరువులో వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనరు సెంథిల్ వేల్ (53) శవమై కనిపించారు. ఆయన ఆత్మహత్య చేసుకున్నారా? లేక హత్య చేసి మృతదేహాన్ని చెరువులో పడేశారా? అనేది తేలాల్సి ఉంది. శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే, పోలూర్ అంబాల్ నగర్‌కు చెందిన సెంథిల్‌వేల్ తమిళనాడు వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనరుగా పనిచేస్తున్నారు. ఈయన గురువారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి వెళ్ళి తిరిగిరాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పోరూర్ చెరువులో ఒక మృతదేహం ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు స్థానికుల సాయంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోరూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక విచారణలో మృతదేహం సెంథిల్ వేల్‌గా గుర్తించి, ఆయన కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. పని ఒత్తిడికారణంగా ఆత్మహత్య చేసుకున్నారా? లేక ఎవరైనా హత్య చేసి మృతదేహాన్ని చెరువులో పడేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'ఉంగల్ తొగుదియిల్ ముదల్వర్' పథకానికి

రూ.3,555 కోట్లు

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'ఉంగల్ తొగుదియిల్ ముదల్వర్' పథకంలో రూ.3,555.53 కోట్లతో 483 పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 10 ముఖ్యమైన సమస్యలను సంబంధిత జిల్లా కలెక్టర్లకు అందజేయాలని 2022 ఆగస్టు 22న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ లేఖ రాశారు. ఆ ప్రకారం, జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఎమ్మెల్యేల కూడిన జిల్లాస్థాయి కమిటీలు, ఆ సమస్యలు పరిశీలించి, ప్రభుత్వానికి సిఫారసు చేస్తాయి. ప్రభుత్వం ఆ సిఫారసులను సంబంధిత శాఖలకు పంపించి, అధ్యయనం చేసి ప్రణాళిక తయారుచేసి ప్రభుత్వానికి అందజేస్తాయి.ఆ ప్రకారం 2023-24వ సంవత్సరంలో రూ.10,968.65 కోట్లతో 786 పనులకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఈ నేపథ్యంలో, 2024-25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులు ఎంపిక కమిటీ సమావేశం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో అక్టోబరు 10వ తేది జరిగింది. అనంతరం ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ఈ నెల 4వ తేది ఉన్నతస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రూ.3,553.53 కోట్లతో 483 పనులు చేపట్టాలని తీర్మానించారు.









అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్ - డిప్యూటీ సీఎం ఉదయనిధి - రాయపేటలోని సత్యమూర్తి భవన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై తదితరులు - రాజ్‌భవన్‌లో బాబా సాహెబ్‌కు గవర్నర్ నివాళి

అంబేడ్కర్‌కు నేతల ఘన నివాళి

ప్యారీస్, డిసెంబర్ 6, (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ రూప శిల్పి డా. బాబా సాహెబ్ అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రముఖులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గిండీలోని రాజ్‌భవన్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద చిత్ర పటానికి గవర్నర్ ఆర్ఎన్ రవి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ స్థానిక ఎగ్మూరులో రాజరత్తినం మైదానంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక కోయంబేడులోని డీఎండీకే కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత పార్టీ శ్రేణులతో కలిసి బాబా సాహెబ్ చిత్రపటానికి పూలు చల్లి నివాళి అర్పించారు. అలాగే డీపీఐ, సమత్వ మక్కల్‌కచ్చి, పీఎంకే, వివిధ దళిత సంఘాలు, రాజకీయ పార్టీలు భారత రత్న డా. బాబా సాహెబ్ అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

సమాచార ధ్వని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వాషర్‌మెన్‌పేట,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా ప్యారీస్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఆయా ప్రాంతాల వివరాలు.. తంబుచెట్టి వీధి, మోర్ వీధి, లింగిచెట్టి వీధి, అంగప్పనాయకన్ వీధి, ఏరబాలు అగ్రహారం వీధి, 2వ బీచ్ రోడ్డు, ముగార్‌నలముత్తు వీధి, బర్మా బజార్, సత్యా నగర్ బి, సి బ్లాక్‌లు, చెన్నై కార్పొరేషన్ పార్క్, హార్బర్, సైనిక క్వార్టర్స్, భారత నౌకాదళం, సైనిక క్యాంటీన్, రిజర్వ్ బ్యాంక్, బీచ్ నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

విద్యార్థులకు రోబోటిక్‌పై శిక్షణ

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రష్యా విద్యాసంస్థ, నగరంలోని పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు రెండు రోజులు రోబోటిక్‌పై శిక్షణ ఇవ్వనుంది. తేనాంపేటలో ఉన్న రష్యా కల్చరల్ సెంటర్, రష్యాకు చెందిన ప్రముఖ విద్యాసంస్థ సంయుక్తంగా ఈ నెల 9,10 తేదీల్లో ఆధునిక రోబోటిక్ పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యాసంస్థలు https://www. swsuonline.ru/robotics-india/en. అనే వెబ్‌సైట్‌లో పేర్లు నమోదుచేసుకోవాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

1 నుంచి రైళ్ల నెంబర్ల మార్పు

పెరంబూర్,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి):వచ్చే ఏడాది జనవరి 1వ తేది నుంచి ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల నెంబర్లు మారనున్నాయి. దక్షిణ రైల్వే పలు మార్గాల్లో ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ తదితరాలు కలిపి మొత్తం 296 రైళ్లు నడుపుతోంది. 2025 జనవరినుంచి ఈ రైళ్ల నెంబర్లు మారుతాయని అధికారులు తెలిపారు.

మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ రాజ్‌లో జరుగనున్న మహా కుంభమేళాకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం మూడు ప్రత్యేక ఆధ్యాత్మిక రైళ్లు నడుపనున్నట్లు ఐఆర్‌సీటీసీ తెలిపింది. తిరునల్వేలి నుంచి జనవరి 16వ తేది బయల్దేరే రైలు మదురై, తిరుచ్చి, తంజావూరు, చెంగల్పట్టు, ఎగ్మూర్ మీదుగా వెళ్లనుంది. అలాగే, పుదుచ్చేరి నుంచి ఫిబ్రవరి 5వ తేది బయల్దేరే రైలు చెన్నై మీదుగా వెళుతుంది. ఇక, మూడో రైలు కోయంబత్తూర్ నుంచి ఫిబ్రవరి 16వ తేది కాట్పాడి మార్గంగా ప్రయాగ్‌రాజ్ వెళ్లనుంది. ఈ రైళ్లకు సంబంధించిన మరిన్ని వివరాలకు 9003140739, 8287931977 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

'టెలిగ్రామ్'లో 81 వేల మంది సభ్యులు

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) 'టెలిగ్రామ్' ఛానల్‌లో మూడు వారాల్లోనే 81,000 మంది సభ్యులుగా చేరారు. గత నెల 14వ తేది టీఎన్‌పీఎస్సీ 'టెలిగ్రామ్' ఛానల్ ప్రారంభించింది. టీఎన్‌పీఎస్సీ నిర్వహించే పరీక్షల నోటిఫికేషన్లు, దరఖాస్తు నమోదు, పరీక్షల పాఠ్యాంశాలు సహా పలు వివరాలు ఈ ఛానల్ ద్వారా అభ్యర్థులు తెలుసుకోవచ్చు. ఈ ఛానల్ ప్రారంభించిన మూడు వారాల్లోనే 81,000 మంది సభ్యులుగా చేరారని టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

17న కావేరి నిర్వహణ మండలి సమావేశం

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కావేరి జల నిర్వహణ మండలి 36వ సమావేశం ఈ నెల 17వ తేది జరుగనుంది. మండలి అధ్యక్షులు ఎస్కే. హల్దర్ నేతృత్వంలో ఢిల్లీలోని మండల కార్యాలయంలో మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం జరుగనుంది. సమావేశంలో పాల్గొనాలని తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల అధికారులకు ఆహ్వానాలు పంపించారు.

సికింద్రాబాద్-విల్లుపురం ప్రత్యేక రైళ్లు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకార్యార్థం సికింద్రాబాద్-విల్లుపురం-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.07601 సికింద్రాబాద్-విల్లుపురం ప్రత్యేక రైలు ఈ నెల 12న సికింద్రాబాద్ నుంచి రాత్రి 7.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.05 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.07602 విల్లుపురం-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 13న విల్లుపురంలో సాయంత్రం 4.05 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.40 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు తిరువణ్ణామలై, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు మీదుగా వెళ్లనుంది. ఈ రైళ్ల రిజర్వేషన్ శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు.

వరద బాధిత జిల్లాల్లో ప్రత్యేక రుణ మేళా

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): తుపానుతో నష్టపోయిన చిరువ్యాపారులకు సహకార బ్యాంక్‌ల ద్వారా ఈ నెల 12వ తేది వరకు ప్రత్యేక రుణ మేళా నిర్వహిస్తున్నట్లు సహకార శాఖ మంత్రి పెరియకరుప్పన్ తెలిపారు. ఆ ప్రకారం, వరద బాధిత జిల్లాలైన విల్లుపురం, కళ్లకుర్చి, తిరువణ్ణామలై, కడలూరు, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాలకు చెందిన చిరు వ్యాపారులకు ప్రత్యేక సూక్ష్మ రుణాలు అందజేయనున్నారు. ఈ శిబిరాల్లో రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం అందించనున్నారు. ఫుట్‌పాత్ వ్యాపారులు, చిరు వ్యాపారులు, పూలు, పండ్ల వ్యాపారులు, మత్స్యకారులు, ఆటో డ్రైవర్లు ఈ రుణ మేళాలో పాల్గొని లబ్ధి పొందవచ్చని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

రుణ బకాయిల కోసం వెళ్తే శునకంతో దాడి !

● వసూలుకెళ్ళిన ఫైనాన్స్ ఉద్యోగిపై కుక్కను ఉసిగొల్పిన మహిళ అరెస్టు



టి.నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో రుణ బకాయిలు వసూలు చేయడానికి వెళ్లిన ఫైనాన్స్ సంస్థ ఉద్యోగిపై పెంపుడు కుక్కను ఉసిగొల్పిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటనలో ఆ విదేశీ జాతి శునకం ఫైనాన్స్ సంస్థ ఉద్యోగిని 12 చోట్ల కరవటంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కోయంబత్తూరు సమీపం వెల్లూరు మహాగణపతి నగర్‌లో మణికంఠన్ (32), దర్శనా అలియాస్ ప్రియా (29) అనే భార్యాభర్తలు నివసిస్తున్నారు. మణికంఠన్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ నాలుగేళ్ల క్రితం రూ.2లక్షలు అడ్వాన్స్ చెల్లించి రూ.6.5ల విలువైన లగ్జరీకారు కొన్నాడు. మిగతా రూ.4.5 లక్షలకు ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో నెలకు రూ.6 వేల చొప్పున వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించేలా రుణం తీసుకున్నాడు. అయితే 20 నెలలుగా మణికంఠన్ ఆ ఫైనాన్స్ సంస్థకు వాయిదాలు చెల్లించలేదు. ఈ నేపథ్యంలో కారు స్వాధీనం చేసుకునేందుకు ఫైనాన్స్ సంస్థ ఉద్యోగులు జగదీష్ (45), సురేష్, కదిరవన్ గురువారం ఉదయం మణికంఠన్ ఇంటికి వెళ్ళారు. నెలవారి బకాయిలు చెల్లించమని ఫైనాన్స్ ఉద్యోగులు కోరగా తమ వద్ద డబ్బులు లేవని బదులిచ్చారు. దీంతో ఆ ఉద్యోగులు తమ దగ్గరున్న మారు తాళం చెవితో అక్కడే పార్కింగ్ చేసి ఉన్న కారును స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. వెంటనే మణికంఠన్ ఆ కారెక్కి అక్కడి నుండి వెళ్లిపోయాడు. ఆ సమయంలో ఇంటి గుమ్మం వద్దే ఉన్న మణికంఠన్ భార్య ప్రియా తను పెంచుతున్న జర్మన్‌షెపర్డ్ జాతి శునకాన్ని ఫైనాన్స్ సంస్థ ఉద్యోగులపై ఉసిగొల్పింది. ఆ శునకం ఫైనాన్స్ ఉద్యోగి జగదీష్‌పైకి వెళ్లి కరిచింది. తక్కిన ఇద్దరు ఉద్యోగులు అక్కడి నుండి భయంతో పరుగులు తీసారు. ఆలోగా స్థానికులు అక్కడికి రావటంతో ప్రియ తన శునకాన్ని వెనక్కి పిలిచి ఇంటిలోకి పంపింది. ఈ సంఘటనలో వళ్లంతా కుక్కకాట్లకు గురైన జగదీష్‌ను సహోద్యోగులు ఆసుపత్రికి తరలించారు. ఆ ఫైనాన్స్ సంస్థ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు శునకాన్ని రెచ్చగొట్టి ఉద్యోగిపై ఉసిగొల్పి కరిపించిన ప్రియను పోలీసులు అరెస్టు చేశారు.

ఊపందుకున్న తాటి టేగల విక్రయాలు



పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం, ఉత్తరమేరూర్, తిరువణ్ణామలై తదితర ప్రాంతాల్లో అధికంగా టేగలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం సీజన్ ప్రారంభం కావడంతో పలు ప్రాంతాల్లో వాటి విక్రయాలు ఊపందుకున్నాయి. కాంచీపురం తాలూకా కార్యాలయం, బస్టాండ్, రైల్వేస్టేషన్, రాజాజీ మార్కెట్ తదితర ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లు, దుకాణాల్లో టేగల విక్రయాలను చేపట్టారు. ఈ విషయమై చిరువ్యాపారి ఎం.వెన్నిల మాట్లాడుతూ.. ఉత్తరమేరూర్‌లో తాటి టేగలు హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి, నీటిలో ఉడకబెట్టి, నాలుగు కట్ట రూ.20కి విక్రయిస్తున్నట్లు, తై మాసం వరకు విక్రయాలకు సీజన్ అని వెన్నెల తెలిపారు.

మునక్కాయలు కిలో రూ.400



పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెల్లుల్లికి పోటీగా మునక్కాయల ధరలు కూడా భారీగా పెరుగుతున్నాయి. ఫెంగల్ తుఫాన్ కారణంగా సాగు పనులు స్తంభించడంతో కోయంబేడు మార్కెట్‌కు కూరగాయల దిగుమతులు తగ్గాయి. ఈ మార్కెట్‌కు ప్రతిరోజు 7,000 నుంచి 8,000 టన్నుల కూరగాయలు దిగుమతవుతున్న తరుణంలో, బుధవారం 4,000 టన్నుల కూరగాయాలు మాత్రమే రావడంతో వాటి ధరలు పెరిగాయి. ముఖ్యంగా, ఈ మార్కెట్‌కు పెరంబలూరు, ఒట్టాన్‌సత్రం, తేని, తిరునల్వేలి, విరుదాచలం తదితర ప్రాంతాల నుంచి మునక్కాయలు వస్తుంటాయి. ప్రస్తుతం సీజన్ ముగియడంతో మునక్కాయల దిగుమతులు తగ్గడంతో, గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి మునక్కాయలు దిగుమతి చేసుకుంటున్నారు. సాధారణంగా 300 నుంచి 400 టన్నుల మునక్కాయల విక్రయాలు జరుగుతుండగా, బుధవారం 50 టన్నులు మాత్రమే మార్కెట్‌కు వచ్చాయి. దీంతో కిలో మునక్కాయలు రూ.350 నుంచి రూ.400 ధర పలికాయి. అదే సమయంలో కొద్ది నెలలుగా వెల్లుల్లి ధర కిలో రూ.450కి చేరుకున్న నేపథ్యంలో, మునక్కాయల ధరలు కూడా పెరగడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

వైభవంగా పొన్నియమ్మన్ ఆలయ కుంభాభిషేకం



వేలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి సమీపం అరుమ్‌పత్తి గ్రామదేవత పొన్నియమ్మన్ ఆలయ కుంభాభిషేకం గురువారం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో రాము, నిర్వాహకులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. తొలుత శ్రీ పొన్నియమ్మన్‌కు విశేష అభిషేకాలు, అలంకరణ, ఆరాధన, ప్రత్యేక దీపారాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాముకు ఆలయం తరపున కుంభ మర్యాదలతో ఆహ్వానించారు.

జాతి నిర్మాణంలో అంబేడ్కర్ పాత్ర గొప్పది

● కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ మోహన్



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మద్రాసు కస్టమ్స్ ఎస్సీ, ఎస్టీ, ఉద్యోగుల సంఘ నాయకులు

ప్యారీస్, డిసెంబర్ 6, (ఆంధ్రజ్యోతి): కుల వివక్షను అంతం చేసి సమానత్వం పెంపొందింపజేస్తూ సమ సమాజం నిర్మించిన దార్శికుడు డా. బాబా సాహెబ్ అంబేడ్కర్ జాతి నిర్మాణంలో వహించిన పాత్ర గొప్పదని చెన్నై కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ ఎస్.మోహన్ కొనియాడారు. స్థానిక హార్బర్ నియోజక వర్గంలోని కస్టమ్స్ కార్యాలయంలో మద్రాసు కస్టమ్స్ ఎస్సీ, ఎస్టీ, ఉద్యోగుల సంఘ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్థంతి సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షులు ఎం.కలైకుమార్, ట్రెజరర్ ఎంఎస్ కార్తికేయన్, ఉపాధ్యక్షుడు పీ ఆది లక్ష్మణ్, పీ బాబు, మాలతి, ఇందిర, సూపరింటెండెంట్ తిల్లైనాయగం, మునుస్వామిరాజన్, బి.శ్రీనివాసన్ తదితరులతో పాటు డిప్యూటీ కమిషనర్ మోహన్ దేశానికి అంబేడ్కర్ అందించిన సేవలను స్మరించుకున్నారు.

అంబేడ్కర్ వర్ధంతిలో ఇరువర్గాల ఘర్షణ



అంబేడ్కర్ బ్యానర్ వద్ద రక్షణగా నిలిచిన వాడామంగళం గ్రామస్థులు

చెన్నై, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి సమీపం వాడామంగళం గ్రామంలో శుక్రవారం ఉదయం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారటంతో ఆ గ్రామంలో పోలీసు బలగాలు మొహరించాయి. ఆ గ్రామంలో 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆదిద్రావిడ సంక్షేమ శాఖ తరఫున వీరికి ఇంటి నివేశన పట్టాలు మంజూరు, ఆయా స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారు. అయితే ఇళ్లు నిర్మించుకున్న ప్రాంతం తమదంటూ కొందరు ఐదేళ్లుగా వీరితో గొడవలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆ గ్రామస్థులు ఊరి మధ్యన అంబేడ్కర్ చిత్రపటాన్ని ఉంచి నివాళులర్పించేందుకు సిద్ధమవుతుండగా ప్రత్యర్థి వర్గానికి చెందిన కొందరు గొడవకు దిగారు. దీంతో అంబేడ్కర్ వర్ధంతి నివాళి కార్యక్రమం అర్ధాంతరంగా ఆగిపోయింది. రెండు వర్గాలవారు పరస్పరం దాడులకు పాల్పడటంతో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. సమాచారం తెలుసుకుని తహసీల్దార్ సత్యా, బర్గూరు డీఎస్పీ ముత్తుకృష్ణన్, సీఐ శివశంకరన్ హుటాహుటిన అక్కడికి వెళ్ళి ఇరుపక్షాలతో చర్చలు జరిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా ఉండటంతో పోలీసు బలగాలను మొహరించారు.



వాడామంగళం గ్రామ పొలిమేరలో పోలీసుల కాపలా

దంత వైద్యశాల ప్రారంభం



వైద్యశాలను ప్రారంభిస్తున్న వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షుడు సెల్వం

వేలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఫిల్టర్ బెడ్ రోడ్డులో 'సుధాకర్ డెంటల్ హాస్పిటల్' ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం పాల్గొని ఆసుపత్రి ప్రారంభించారు. ఆస్పత్రి స్థాపకుడు సుధాకర్, మాజీ మంత్రి వీఎస్ విజయ్ సహా పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

జలాశయాల్లో 8 టీఎంసీలు

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరానికి తాగునీరందించే ఐదు జలాశయాల్లో 8 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. ఈ జలాశయాల్లో గత ఆరురోజుల్లోనే 2.6 టీఎంసీల నీరు చేరింది. గత నెల 30వ తేది ఈ ఐదు జలాశయాల్లో 47.6 శాతం (5.599 టీఎంసీలు) నీటి నిల్వలుండగా, గురువారం ఉదయం గణాంకాల ప్రకారం 8.285 టీఎంసీల నీటినిల్వలున్నాయని అధికారులు తెలిపారు.

20 వరకు శాసనసభ కమిటీలకు వినతిపత్రాలు

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాసనసభ కమిటీలకు ఈ నెల 20వ తేది వరకు వినతిపత్రాలు పంపించవచ్చని కరూర్ జిల్లా కలెక్టర్ తంగవేల్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర అసెంబ్లీ 2024-25వ ఆర్థిక సంవత్సరకు సంబంధించి పిటిషన్ల కమిటీలు అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్నాయని తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు 'అధ్యక్షుడు, పిటిషన్ల కమిటీ, తమిళనాడు శాసనసభ, చెన్నై-600009 అనే చిరునామాకు, నేరుగా కలెక్టర్, డీఆర్వో, ఆర్డీఓ, తహసీల్దార్లకు ఈ నెల 20వ తేదిలోపు సమర్పించాలి. ఒక వ్యక్తి పలు వినతిపత్రాలు సమర్పించినా, వాటిలో ముఖ్యమైన ఒక వినతిపత్రం మాత్రమే కమిటి స్వీకరిస్తుంది. 20వ తేది అనంతరం సమర్పించే వినతిపత్రాలను కమిటీ పరిశీలించదని కలెక్టర్ తెలిపారు.

9 మంది జిల్లా రిజిస్ట్రార్ల బదిలీ

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఫిర్యాదులు, నిర్వహణ కారణాలతో 9 మంది జిల్లా రిజిస్ట్రార్లను బదిలీ చేశారు. రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాల పనితీరును జిల్లా రిజిస్ట్రార్లు పర్యవేక్షిస్తుంటారు. సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాల్లో విధులు సక్రమంగా చేయకపోవడం, రిజిస్ట్రేషన్లలో కూడా జాప్యం జరుగుతుందని, వీటిని పర్యవేక్షించడంలో జిల్లా రిజిస్ట్రార్లు విఫలమయ్యారని ఇటీవల ఉన్నతాధికారుల పరిశీలనలో తెలిసింది. దీంతో, సెంట్రల్ చెన్నై, తిరువళ్లూర్, తిరునల్వేలి, తిరుచ్చి, మదురై సౌత్, తిరుప్పూర్, ఊటీ, విరుదునగర్, పెరియకుళం తదితర ప్రాంతాల్లోని జిల్లా రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ రిజిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి బ్రజేంద్ర నవనీత్ ఉత్తర్వులు జారీచేశారు.

కార్మిక సంక్షేమ బోర్డులో 18.81 లక్షల మంది కొత్త సభ్యులు

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గడిచిన మూడున్నరేళ్లలో 20 అసంఘటిత కార్మిక సంక్షేమ బోర్డులో 18.81 లక్షల మంది కొత్తగా పేర్లు నమోదుచేసుకున్నట్లు కార్మిక శాఖ మంత్రి సీవీ గణేశన్ తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. ఈ బోర్డు ద్వారా 23.35 లక్షల మంది కార్మికులకు రూ.2106 కోట్ల సంక్షేమ సహాయాలు అందించామన్నారు. అలాగే, సంక్షేమ బోర్డు సభ్యుల పింఛన్ రూ.1,000 నుంచి రూ.1,200 పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించినట్లు గుర్తుచేశారు. కార్మిక సంక్షేమ పథకాల రూపకల్పనలో ద్రావిడ ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తోందని కార్మిక శాఖ మంత్రి సీవీ గణేశన్ పేర్కొన్నారు.

నీట్‌లో 87 మార్కులొస్తే అడ్మిషన్లు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నీట్‌లో 87 మార్కులు పొందిన అభ్యర్థులు, సిద్ధ, యునానీ, ఆయుర్వేద, హోమియోపతి కోర్సుల్లో చేరవచ్చు. అలాగే, ప్లస్ టూలో 35 మార్కులు సాధించిన వారు యోగా, ప్రకృతి వైద్యం కోర్సుల్లో చేరేలా కటాఫ్ మార్కులు తగ్గించారు. భారతీయ వైద్యం, హోమియోపతి శాఖ పరిధిలోని ప్రభుత్వ, స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో సిద్ధ, యునానీ, ఆయుర్వేద, హోమియోపతి కోర్సుల్లో విద్యార్థుల ఎంపిక నీట్ మార్కుల ఆధారంగా జరుగుతోంది. వాటిలో ప్రభుత్వ కోటాలో 115 సీట్లు, మేనేజ్‌మెంట్ కోటాలో 112 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ సీట్ల భర్తీకి నీట్ మార్కులు తగ్గించారు. జనరల్ విభాగానికి 112 మార్కులు, రిజర్వేషన్ కోటాలో 87 మార్కులు వచ్చిన విద్యార్థులు చేరేందుకు అవకాశం కల్పించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు అరుంబాక్కంలోని సిద్ధ ఆస్పత్రి ప్రాంగణంలోని ఎంపిక కమిటీకి ఈ నెల 10వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుల ఆధారంగా ప్రభుత్వ కోటా సీట్లకు 11వ తేది, మేనేజ్‌మెంట్ కోటాకు 12వ తేది వరకు విద్యార్థుల అడ్మిషన్లు చేపడతామని అధికారులు తెలిపారు.

ఆలయ కొలనులో మొసలి పట్టివేత



పట్టుబడిన మొసలి

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆలయ కొలనులో సంచరిస్తున్న మొసలిని అటవీ శాఖ సిబ్బంది బంధించారు. కడలూరు జిల్లా చిదంబరం సమీపం మెయ్యాత్తూర్ గ్రామంలోని ఆలయ కొలనులో మొసలిని గుర్తించిన గ్రామస్థులు దిగ్భ్రాంతి చెందారు. గ్రామస్థుల సమాచారంతో చిదంబరం రేంజర్ పన్నీర్‌సెల్వం నేతృత్వంలో సిబ్బంది అన్బుమణి, జ్ఞానశేఖరన్, మొసలి బంధించే బృందంతో అక్కడకు చేరుకున్నారు. కొలనులో నాలుగు గంటల సేపు ప్రయత్నించిన 8 అడుగుల పొడవు, 70 కిలోల బరువున్న మొసలిని బంధించారు. ఆ మొసలిని వక్కారమారి నదిలో వదిలినట్లు రేంజర్ పన్నీర్‌సెల్వం తెలిపారు.

పోలీస్‌స్టేషన్ ప్రారంభించిన మంత్రి



పోలీస్‌స్టేషన్ ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి డివిజన్‌లో కొత్తగా నిర్మించిన బ్రహ్మపురం పోలీస్‌స్టేషన్‌ను మంత్రి దురైమురుగన్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్ల కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎస్పీ మదివానన్, ఎమ్మెల్యే నందకుమార్, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, 1వ మండల కమిటీ అధ్యక్షులు పుష్పలత వన్నియరాజ, కాట్పాడి యూనియన్ కమిటీ సెక్రటరీ వేల్‌మురుగన్, ఉపాధ్యక్షుడు శరవణన్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి దురైమురుగన్, కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎంపీ కదిర్ ఆనంద్, ఎమ్మెల్యేలు, అధికారులు

హత్యకు దారితీసిన అక్రమసంబంధం

● అడ్డుగా ఉన్నాడని భర్తను హత్య చేయించిన భార్య
● ప్రియుడి సహా ముగ్గురి అరెస్టు

అడయార్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తను తన ప్రియుడితో కలిసి భార్య హత్య చేసింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. తిరుపూరు జిల్లా అవినాశి యూనియన్ వేలాయుధపాళెయం పంచాయతీ కాశీగౌండంపాళెయం ప్రాంతానికి చెందిన రమేశ్ (48) టూవీలర్, కార్లు కొనుగోలు చేసి విక్రయించడం, ఆస్తులను తనాఖా పెట్టుకుని వడ్డీకి రుణాలిస్తున్నారు. ఈయనకు విజయలక్ష్మి (44) అనే భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ నెల ఒకటో తేదీన రమేష్ వాకింగ్‌కు వెళ్ళగా గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ విచారణలో భాగంగా సీసీ పుటేజీలను పరిశీలించగా, రమేష్‌ను నిర్మానుష్య ప్రాంతానికి కిడ్నాప్ చేసి హత్య చేసినట్లు తేలింది. ఈ కేసులో గోపాలకృష్ణన్ (35), అజీత్ (27), సింబోస్ (23), చరణ్ (24), జయ ప్రకాష్ (45) అనే ఐదుగురిని పోలీసులు రెండు రోజుల క్రితం అరెస్టు చేశారు. విచారణలో రమేష్ భార్య విజయలక్ష్మికి అవినాశి మంగళం సాలైలో చిప్స్ దుకాణం నడిపే ఇర్ఫాన్ (28) అనే వ్యక్తితో అక్రమ సంబంధం ఉన్నట్టు గుర్తించారు. తన అక్రమ సంబంధానికి భర్త అడ్డుగా ఉండటంతో కిరాయి ముఠాతో చేతులు కలిపి భర్తను హత్య చేయించినట్టు విచారణలో వెల్లడైంది. దీంతో విజయలక్ష్మి, కిరాయిముఠా నాయకుడు జానకిరామన్ సహా మొత్తం ముగ్గురుని శుక్రవారం అరెస్టు చేశారు.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

అడయార్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖ తరఫున చెన్నై భద్రతా విభాగానికి అందజేసిన వాహనాన్ని ధ్వంసం చేసిన కేసులో అడయార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జయలక్ష్మి సస్పెండ్‌కు గురయ్యారు. ఈ మేరకు ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధాకర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. మైలాపూరులోని పోలీస్ క్వార్టర్స్‌లో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఇళయరాజా నివశిస్తుండగా, ఇదే భవనం కింది పోర్షన్‌లో జయలక్ష్మి ఉంటున్నారు. వీరిద్దరికి అపార్టుమెంట్‌లోని ఖాళీస్థలం అంశంలో వివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఇళయరాజాకు ప్రభుత్వం ఇచ్చిన బైక్, ఆయన భార్యకు చెందిన స్కూటీని జయలక్ష్మి, ఆమె భర్త, రిటైర్డ్ డీఎస్పీ సౌందర్‌రాజన్ ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేశారు. దీనిపై ఇళయరాజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో జయలక్ష్మి, ఆమె భర్త ప్రభుత్వ వాహనాన్ని ధ్వంసం చేసినట్టు తేలింది. దీంతో జయలక్ష్మిని సస్పెండ్ చేశారు.

త్వరలో కవరపేట ఘటన నిందితుల ఆచూకీ

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కవరపేట రైలు ప్రమాదానికి కారణమైన నిందితులను ఆచూకీ లభ్యమైనట్లు రైల్వే డీజీపీ వన్నియ పెరుమాళ్ తెలిపారు. నగరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ ప్రమాదానికి సంబంధించి సరైన మార్గంలో కేసు విచారణ జరుగుతోందన్నారు. నిందితుల ఆచూకీ తెలుసుకునేందుకు దగ్గరగా ఉన్నామని, త్వరలో వారి వివరాలకు అధికారపూర్వకంగా తెలియజేస్తామని డీజీపీ తెలిపారు.

మృతి చెందిన గుర్రానికి అంత్యక్రియలు

ప్యారీస్, డిసెంబర్ 6, (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై మనలి ప్రాంతంలో రోడ్డు ప్రక్కన మృతి చెందిన గుర్రానికి మున్సిపల్ పారిశుధ్య కార్మికులు అంత్యక్రియలు నిర్వహించి ఖననం చేశారు. మనలి ముల్లైవాయల్ రోడ్డులో పదికి పైగా గుర్రాలు సంచరిస్తూ రోడ్డు ప్రక్కన సేదతీరుతుండగా వీటిలో ఒక గుర్రం అనారోగ్యంతో రోడ్డు ప్రక్కన మృతి చెందింది. దీనిని స్థానికులెవరూ పట్టించుకోకపోవడంతో గుర్రం కలేబేరం కుళ్లి గత మూడు రోజులుగా దుర్వాసన రావడంతో కొంత మంది కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కార్పొరేటర్ ముల్లై రాజశేఖర్ నేతృత్వంలో శుక్రవారం గుర్రం కలేబేరాన్ని పారిశుధ్య కార్మికులు ఖననం చేశారు.

కోయంబేడులో వ్యాపారి ఆకస్మిక మృతి

ప్యారీస్, డిసెంబర్ 6, (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్రం గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు చెందిన వ్యాపారి రాజకుమార్(48) కోయంబేడులోని ఆమ్నీ బస్ టెర్మినల్‌లో హఠాత్తుగా మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మధురై జిల్లాలోని పారపట్టి గ్రామానికి చెందిన రాజకుమార్ 20 ఏళ్లుగా చిలకలూరిపేటలో బజ్జీ, బోండాల దుకాణం నడుపుతున్నాడు. ఆయన తమ సొంతూరు వెళ్ళేందుకు గురువారం చిలకలూరిపేట నుంచి ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో కోయంబేడు ఆమ్నీ బస్ టెర్మినల్‌లో దిగారు. బయటకు నడిచివెళుతూ స్పృహకోల్పోయి కింద పడిన రాజకుమార్‌ను అక్కడున్న కొంతమంది అంబులెన్స్‌లో కీల్పాక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయనను పరిక్షించిన వైదులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో విద్యార్థులు

తిరుత్తణి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టులో శుక్రవారం ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పళ్లిపట్టు సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ తంగమూరి ప్రారంభించగా, పాఠశాల విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేలా ప్ల కార్డులతో నినాదాలు చేశారు. కార్యక్రమం అనంతరం ప్రొఫెసర్ విశ్వనాథన్ ఎయిడ్స్ సంక్రమించే విధానం, చికిత్స తదితరాలపై వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.రాజా, కార్తికేయన్, ఉషా, ప్రియ, అంబిక, మోనీషా, డి.యువరాణి, శారద తదితరులు పాల్గొన్నారు.

చైనా ఇంజన్లతో మర పడవల స్వాధీనం



రామేశ్వరం ఫిషింగ్ హార్బర్‌లో మర పడవలను పరిశీలిస్తున్న అధికారులు

ప్యారీస్, డిసెంబర్ 6, (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా రామేశ్వరం ఫిషింగ్ హార్బర్‌లో చైనా ఇంజన్లున్న రెండు మర పడవలను మత్స్య శాఖ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఫిషింగ్ హార్బర్‌లో సుమారు 800లకు పైగా మర పడవలతో 10 వేల మందికి పైగా మత్స్యకారులు చేపలవేటకు వెళ్తారు. మత్స్యశాఖ నిబంధనల ప్రకారం చక్కతో డిజైన్ చేసిన, ప్రభుత్వం అనుమతించిన ఇంజన్లతో కూడిన మర పడవలతో మాత్రమే చేపల వేటకు వెళ్లాలి. అయితే మత్స్యశాఖ ట్రిబ్యూనల్ చట్టం 1983 నిబంధనలను పాటించకుండా రామేశ్వరం ఫిషింగ్ హార్బర్‌లో అత్యధిక హార్స్‌పవర్ సామర్థ్యం కలిగిన చైనా ఇంజన్లతో కూడిన నాలుగు మర పడవలను అధికారులు గుర్తించి సంబంధిత పడవల యజమానులకు నోటీసులిచ్చారు. ఈ నేపథ్యంలలో ఆదేశాలు పాటించకుండా నిషేధించిన మర పడవలతో చేపల వేటకు వెళ్తున్నారనే సమాచారంతో రామేశ్వరం మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదర్ నేతృత్వంలో అధికారులు శుక్రవారం తనిఖీలు చేసి చైనా ఇంజన్లున్న రెండు పడవలను స్వాధీనం చేసుకున్నారు.

ఆయక్కుడి షోరూమ్‌లో కారు చోరీ



ఆయక్కుడి రహదారిలో ఉన్న మారుతీ షోరూమ్

ఐసిఎఫ్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళని - దిండుగల్ జాతీయ రహదారిలో ఆయక్కుడి వద్దనున్న మారుతీ షోరూమ్‌లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అద్దాలు పగులగొట్టి రూ.10లక్షల విలువైన స్విఫ్ట్ కారు అపహరించుకెళ్ళారు. ఆ షోరూమ్ వాచ్‌మాన్ అల్లిముత్తు (75) చలికి తట్టుకోలేక సమీపంలో ఉన్న ఓ షెడ్డులో నిద్రపోయాడు. అదే అదనుగా దోపిడీ దొంగలు ఆ షోరూమ్ ముందువైపు అద్దాలు పగులగొట్టి, సీసీ కెమెరాలను, హార్డ్ డిస్క్‌ను ధ్వంసం చేసి కారును అపహరించుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దోపిడీ దొంగల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.


డాక్టరేట్ అందుకుంటున్న ఎస్‌జే సూర్య

మళ్లీ మెగాఫోన్ పట్టనున్న ఎస్‌జే సూర్య ?

చిత్రజ్యోతి

ప్రముఖ దర్శక నటుడు ఎస్‌జే సూర్య సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ మెగాఫోన్ పట్టనున్నారు. ఈ సినిమాకు 'కిల్లర్' అనే టైటిల్ ఖరారు చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. 2015లో సూర్య దర్శకత్వం వహించిన చివరి చిత్రం 'ఇసై'. బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఆ తర్వాత దర్శకత్వానికి విరామం ఇచ్చి నటుడిగా అవతారమెత్తారు. విలన్‌తో పాటు క్యారెక్టర్ ఆర్టిస్టుగా తమిళం, తెలుగు, మలయాళ భాషల్లో రాణిస్తున్నారు. ప్రస్తుతం ప్రతినాయకుడిగా దాదాపు రూ.10 నుంచి రూ.12 కోట్ల మేరకు పారితోషికం తీసుకుంటున్నట్టు సమాచారం. శంకర్ దర్శకత్వం వహించిన 'గేమ్ ఛేంజర్' విడుదలైన నెల రోజుల్లో తన 'కిల్లర్' ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను వెల్లడించనున్నారు. ఇందులో హీరోగా నటిస్తూ సొంతంగా నిర్మించనున్నారు. ఇదిలా వుంటే, ఇటీవల నగరంలోని ప్రముఖ విద్యా సంస్థ వేల్స్ విశ్వవిద్యాలయం 15వ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్‌జే సూర్యకు గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించగా, దీన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, వేల్స్ వర్సిటీ చాన్సెలర్ డాక్టర్ ఐసరి కె.గణేశ్ చేతుల మీదుగా ఎస్‌జే సూర్య అందుకున్నారు.



త్రిష ప్రధాన పాత్రలో '96' సీక్వెల్

గతంలో త్రిష, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలు పోషించిన '96' చిత్రానికి సీక్వెల్ రూపొందనుంది. ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులను త్వరలోనే ప్రారంభించనున్నారు. కార్తీ హీరోగా నటించిన 'మెయ్యళగన్' ప్రచార సమయంలో దర్శకకుడు ప్రేమ్ కుమార్ ఈ చిత్రం రెండో భాగానికి స్క్రిప్టు సిద్ధం చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ ప్రకారంగానే 96 మూవీ రెండో భాగాన్ని డాన్ పిక్చర్స్ నిర్మాణ సంస్థ తెరకెక్కించేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. పైగా ఈ మూవీలో నటించేందుకు త్రిష, సేతుపతి కూడా అంగీకారం తెలిపారు. దీంతో 2025లో షూటింగ్ ప్రారంభించేందుకు దర్శకుడు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.


జయభారతి (ఫైల్‌ఫొటో)

సీనియర్ దర్శకుడు జయభారతి కన్నుమూత

ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ కారణంగా ఆస్పత్రిలో చేరిన సీనియర్ దర్శకుడు, జాతీయ అవార్డు గ్రహీత జయభారతి (77) శుక్రవారం కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా గురువారం ఓమందూరార్ ఆస్పత్రిలో చేరిన ఆయన శుక్రవారం ఉదయం 6 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయన మృతిపట్ల చిత్రపరిశ్రమకు చెందిన ప్రముఖుల తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన సినీ దర్శకుడు మాత్రమే కాదు మంచి రచయిత కూడా. క్రౌడ్ ఫండింగ్ ద్వారా 1979లో తమిళంలో నిర్మించిన 'గుడిసై' అనే చిత్రానికి ఆయన దర్శకత్వం వహించారు. ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకోవడమేకాకుండా, పలు అవార్డులను కూడా కైవసం చేసుకుంది. ఆ తర్వాత 'ఊమై జనంగల్', 'రెండు రెండు అంజి', 'ఉచ్చి వెయిల్', 'నణ్బా నణ్బా' అనే చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన చివరగా 2010లో 'పుత్తిరన్' అనే మూవీకి దర్శకత్వం వహించారు. ఈ సినిమాకు ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ చిత్రం అవార్డులను రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. ఈయన అనేక చిత్రాలకు దర్శకత్వం వహించినప్పటికీ కమర్షియల్ పరిధిలో చిక్కుకోకుండా తన బాణీలోనే సినిమాలు తీసారు.

సింగముత్తు నోటికి హైకోర్టు తాళం

ప్రముఖ హాస్య నటుడు వడివేలును కించపరిచేలా మాట్లాడొద్దని మరో హాస్య నటుడు సింగముత్తుకు మద్రాస్ హైకోర్టు శుక్రవారం ఆదేశించింది. గతంలో పలు యూ ట్యూబ్ చానెళ్ళకు సింగముత్తు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో వడివేలు గురించి అసత్య ఆరోపణలు చేయడంతో పాటు హేళనగా మాట్లాడారు. తన గురించి సింగముత్తు అసత్య ప్రచారం చేయకుండా ఆదేశించాలని కోరుతూ వడివేలు హైకోర్టులో పిటిషన్ వేశారు. తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగించేలా సింగముత్తు అసత్య ప్రచారం చేస్తున్నారంటూ రూ.5 కోట్లకు పరువు నష్టం దావా కూడా వేశారు. దీనిపై పలుమార్లు విచారణ చేపట్టిన హైకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. ఇకపై వడివేలును ఉద్దేశించి ఎక్కడా కూడా అసత్య ప్రచారం చేయరాదని, ఆయన గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగేలా మాట్లాడొద్దని, గతంలో చేసిన వ్యాఖ్యలను యూట్యూబ్ చానళ్ల నుంచి తొలగించాలని ఆదేశించింది.


వడివేలు, సింగముత్తు



వృత్తి, ప్రవృత్తుల్లో విజయం సాధించాలంటే మనో శక్తి-సంకల్పం రెండూ ఉండాలి. శక్తులన్నింటినీ సమీకరించి పట్టుదలతో, దృఢమైన కార్యదీక్షతో సమర్థవంతంగా కృషి సల్పినప్పుడే వృత్తి, ప్రవృత్తులకు సమ ప్రాధాన్యత ఇవ్వగల సత్తా సమకూర్చుకోగలుగుతారు. ఏక కాలంలో కోరుకున్న వృత్తిని ఇష్టంగా నిర్వహిస్తూ, తమ అభీష్టానికి తగిన ప్రవృత్తులను పండించుకొనే ప్రజ్ఞ సాధించగలుగుతారు. 'ఇది సాధ్యం కావాలంటే శక్తి అంతా నీలోనే ఉంది- నీవు ఏదైనా చేయగలవు' అని స్వామి వివేకానంద అన్నట్లు అంతటి ఆత్మవిశ్వాసంతో కార్యచరణకు పూనుకోవాలి. దీనికి నిరూపణగా డాక్టర్ కావాలన్న కోరిక నెరవేర్చుకుని, అదే సమయంలో తనకు నచ్చిన సంగీత, నాట్యకళల్లో ప్రతిభ కనబరస్తున్నారు డాక్టర్ గాయత్రీ బాలచంద్రన్. ఆమె వృత్తి, ప్రవృత్తుల జీవన ప్రస్థానం ఈనాటి 'తరుణి'లో....

- వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి

వృత్తిలో నిబద్ధత... ప్రవృత్తిలో ప్రతిభ

తరుణి



"చెన్నైలోని మ్యూజిక్ అకాడమీలో నా ఆరంగేట్రం ప్రదర్శనకు పద్మశ్రీ చిత్రా విశ్వేశ్వరర్ ముఖ్య అతిథిగా, కలైమామణి జీఎస్ మణి గౌరవ అతిథిగా విచ్చేయడం మర్చిపోలేని అనుభూతి అన్నారు గాయత్రి. టీటీడీ 'నాదనీరాజనం' కార్యక్రమంలో పలుసార్లు నాట్య ప్రదర్శనలిచ్చారు గాయత్రి. చిదంబరం దేవాలయ ఉత్సవాలు, ఇంకా మరెన్నో దేవాలయ ఉత్సవాలలో ప్రదర్శనలిచ్చారు. తన గురువు డా.మాధవితో కలిసి కూడా కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొని పలువురి పలువురి ప్రశంసలందుకున్నారు. ఎన్నో డాన్స్ బాలేలకు రూపకల్పన చేశారు.

● నృత్య, గానాల్లో రాణిస్తున్న గాయత్రీ బాలచంద్రన్

గాయత్రి పుట్టింది తమిళనాడులోని 'ఈరోడ్'లో. పెరిగింది చెన్నైలో. తండ్రి ప్రపంచం ఎస్.బాలచంద్రన్, తల్లి రమ్యా బాలచంద్రన్. గాయత్రికి ఒక సోదరుడు. గాయత్రి తండ్రి చెన్నై ఆకాశవాణిలో స్టేషన్ డైరెక్టర్‌గా ఉండేవారు. గాయత్రి చెన్నైలోని చిన్మయ విద్యాలయంలో పాఠశాల చదువు పూర్తిచేశారు. చెన్నైలోని 'సాయిరామ్ ఆయుర్వేదిక్ మెడికల్ కాలేజీ' లో మెడిసిన్ చేశారు. ఆపైన మంగళూరులో పీజీ పూర్తిచేశారు.



నాట్య కళాకారిణిగా ...

నాట్య కళాకారిణి కావాలన్న కోరికకు బాల్యంలోనే బీజం పడింది గాయత్రికి. ఆమెకు కూచిపూడి నృత్య కళాకారిణి కావాలనే కోరిక ఉండేది. డాక్టర్ మల్లంపల్లి మాధవి నృత్యప్రదర్శన చూసిన వెంటనే ఆమె శిష్యురాలిగా చేరి, మాధవి స్థాపించిన 'మధుర కళానికేతన్' డ్యాన్స్ స్కూలులో శిక్షణ పొందింది. పదేళ్లపాటు కూచిపూడి నాట్యాన్ని అభ్యసించి నాట్యప్రదర్శనలిచ్చే స్థాయికి ఎదిగింది గాయత్రి.

ప్రముఖుల ప్రశంసలందుకుంటూ..


తల్లిదండ్రులతో..

'ఆయుర్వేదం, సంగీతం, నాట్యం ఈ మూడు కూడా ప్రకృతితో ముడుపడి ఉన్నవే. అందుకే నాకు వీటితో అంత సాన్నిహిత్యం' అంటారు గాయత్రి. "ఆసక్తి ఉన్న రంగంలో అందరూ ముందుకు వెళ్లే ప్రయత్నం చేయాలి. సంకల్పంతో పాటు, అడ్డంకులు, అవాంతరాలు ఎదురొడ్డే ధైర్యం, కార్యదీక్ష, కార్యాచరణ, సామర్థ్యం పెంపొందించుకోవాలి. ఎంచుకున్న రంగంలో విజయబావుటా ఎగురవేయాలి". అని 'తరుణి'తో తన మనోభావాలను పంచుకున్నారు గాయత్రి.

వైద్యురాలిగా...

గాయని, భరతనాట్య కళాకారిణి వైద్యురాలు ఎలా అయిందో చెబుతూ.. "నాకు బాల్యం నుంచి డాక్టర్ కావాలన్న కోరిక. వయసుతో పాటే అది వృద్ధిచెందుతూ వచ్చింది. ఎంత కష్టమైనా ఇష్టంగా నా ఆకాంక్ష నెరవేర్చుకోవాలనుకున్నాను. పట్టుదలతో శ్రమించాను. నా అభీష్టాన్ని ఫలప్రదం చేసుకొని ఆయుర్వేద వైద్యురాలినయ్యాను. వృత్తి పరంగా వైద్యం, ప్రవృత్తి పరంగా సంగీతం, నాట్యం అన్నిటికీ సమప్రాధాన్యనిచ్చి అన్ని రంగాల్లో విజయం వైపు ముందడుగు వేస్తున్నాను" అని వివరించారు. ఆయుర్వేద వైద్యురాలిగా గాయత్రి పదేళ్ల అనుభవాన్ని సంపాదించారు. కోడంబాక్కంలోని డా.మాధవి క్లినిక్‌లో గాయత్రి కూడా పనిచేస్తున్నారు. పనిని ప్రేమించి డాక్టర్‌గా జీవితాన్ని అర్థవంతం చేసుకుంటున్నారు. గాయత్రి పుట్టుకరీత్యా కన్నడ కుటుంబానికి చెందినవారు కావడంతో కన్నడ, మరాఠీ అనర్గళంగా మాట్లాడగలరు. ఇంగ్లీష్, తమిళ, హిందీ భాషల్లో కూడా ప్రావీణ్యం ఉంది. తెలుగులోనూ ప్రవేశం ఉంది.



వారసత్వంగా సంగీతం..

గాయత్రికి సంగీతం వారసత్వంగా వచ్చింది. గాయత్రి తాతగారు పల్లడమ్ ఎస్ వెంకటరమణారావు హార్మోనియంలో అందెవేసిన చెయ్యి. తండ్రి డాక్టర్ ప్రపంచం బాలచంద్రన్ సంగీతజ్ఞులు. తల్లి వైణికురాలు. గాత్ర సంగీతకారిణి. ఎంతోమంది విద్యార్థులకు శాస్త్రీయ సంగీతంలో శిక్షణయిచ్చిన గురువు. సోదరుడు కీబోర్డు వాద్య నిపుణుడు.

గాయత్రికి సంగీతంలో తల్లే తొలిగురువు, శాస్త్రీయ సంగీతంలో తండ్రి, తాతల నుండి ప్రాథమిక శిక్షణ పొందింది. ఇంట్లో నిరంతరం సంగీత వాతావరణమే. "సంగీతంతో నిద్రలేవడం, సంగీతంతో నిద్రించడం అలవాటైన నాకు చిన్నతనంలోనే సంగీతం పట్ల ఆసక్తి కలిగింది. అందుకే చదువుతో పాటే సంగీతం కూడా అభ్యసించాను. అమ్మ సోదరి రాధా సత్యనారాయణరావు కూడా శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు. ప్రస్తుతం ఆమె వద్ద సంగీతంలో అడ్వాన్స్ కోర్సు నేర్చుకుంటున్నాను. అంతేకాదు, మద్రాసు విశ్వవిద్యాలయంలో మ్యూజిక్ ఎంఏ చేస్తున్నాను" అన్నారు గాయత్రి.

సంగీతానికి భాషాభేదం లేదని నిరూపిస్తూ గాయత్రి 'హిందుస్తానీ సంగీతం' కూడా అభ్యసిస్తున్నారు. గత ఏడు సంవత్సరాలుగా ఉస్తాద్ హసన్ జుల్ కరియన్‌నిలోయ్ వద్ద హిందుస్తానీ సంగీతంలో గాయత్రి పొందుతున్నారు. గాయత్రికి లలిత సంగీతంలోనూ ప్రావీణ్యం ఉంది. శాస్త్రీయ సంగీత గాత్ర కచేరీ, లలిత సంగీత ఆల్బమ్స్ గాయత్రి ఖాతాలో చోటుచేసుకున్నాయి. ఎన్నో కూచిపూడి నృత్యప్రదర్శనలకు నేపథ్యగానం అందించింది గాయత్రి.


కూచిపూడి నృత్యం

ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తుల దర్శనం

వేలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వరుడి ఆలయంలో రెండో రోజైన గురువారం రాత్రి పంచమూర్తులు వివిధ వాహనాల్లో విహరించారు. ప్రత్యేకంగా విద్యుద్దీపాలతో అలంకరించిన వాహనాల్లో ఉత్సవమూర్తులు ఆసీనులై మాడవీధుల్లో విహరించారు.ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు పలు స్వచ్ఛంద, ఆధ్యాత్మిక సంస్థలు అన్నదానం చేశారు.


ప్రత్యేక అలంకరణలో అరుణాచలేశ్వరుడు, ఉన్నామలై అమ్మవారు




వెండి విమానంలో వల్లి, దేవయాని సమేత సుబ్రమణ్యస్వామి, వినాయకుడు

ఊటీలో రూ.70 కోట్లతో పార్కు

● నిధులు కేటాయించిన కేంద్రం

అడయార్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కూడలూరు సమీపంలోని దేవాలా అనే ప్రాంతంలో రూ.70.23 కోట్లతో పార్కు నిర్మించనున్నారు. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఊటీకి ప్రతి యేటా లక్షలాది మంది పర్యాటకులు విహార యాత్రకు వస్తుంటారు. వీరిలో ఎక్కువ మంది విదేశీయులు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో దేశంలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి, పర్యాటక రంగాన్ని మరింతగా ప్రోత్సహించేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, ఊటీలోని దేవాలలో ఈ పార్కు నిర్మించతలపెట్టింది. పార్కుతో పాటు బోటింగ్ హౌస్‌తో పాటు అనేక సౌకర్యాలను కల్పించనుంది. ఈ పార్కు కేరళ రాష్ట్రం నుంచి వచ్చే పర్యాటకులకు ఎంతో అనువుగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఆపత్ సహాయేశ్వరాలయానికి యునెస్కో అవార్డు

ప్యారీస్, డిసెంబర్ 6, (ఆంధ్రజ్యోతి): తంజావూర్ జిల్లా కుంభకోణంలో ప్రసిద్ధి చెందిన ప్రాచీన ఆపత్ సహాయేశ్వరాలయానికి యునెస్కో అవార్డు ప్రకటించింది. ఈ ఆలయంలో జీర్ణోద్ధరణ పనులు 2023వ సంవత్సరం సెప్టెంబర్‌లో పూర్తయి హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకం కోలాహలంగా జరిగింది. ఆలయ ప్రాచీన ఆగమశాస్త్రానికి ఎలాంటి భంగం వాటిల్లకుండా, ఆలయ గోపురంలో శిల్పకళా నైపుణ్యతను మరింత మెరుగులు దిద్దేలా సుందరంగా పునఃరుద్ధరించారు. 10వ శతాబ్ద కాలంలో తంజావూరును పరిపాలించిన చోళరాజ వంశానికి చెందిన రాజేంద్ర చోళ, విక్రమ చోళ చక్రవర్తుల వంశానికి చెందిన 1వ ఆదిత్య 1వ పరాంతక చోళ రాజులు ఈ ఆలయాన్ని నిర్మించి 48 రోజులు పూజల్లో పాల్గొన్నట్లు ప్రాచీన శిలా శాసనాలు చెబుతున్నాయి. ఆ రాజులు దక్షిణ భారతదేశంలో నిర్మించిన శివాలయాల్లో అత్యుత్తమమైనది కుంభకోణం ఆపత్ సహాయేశ్వరాలయం కావడం గమనార్హం. ఈ ఆలయంలో పరమేశ్వరుడు ప్రధాన మూర్తిగా, శరభేశ్వర, వారాహీ దేవి, జ్యేష్ఠాదేవి, సప్త మాతలు, దక్షిణా మూర్తి, వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మహాలక్ష్మీ తదితల దేవతా మూర్తుల సన్నిధులతో, ఏడు ప్రాకారాలతో భక్తులను ఆకట్టుకుంటుంది. దక్షిణ కాళహస్తిగా పిలువబడే ఈ తుకచ్చీ ఆపత్ సహాయేశ్వరాలయాన్ని ఇటీవల పరిశీలించిన యునెస్కో ప్రతినిథుల బృందం అవార్డు ప్రకటించడం ఆలయానికి మరెంత ఘనత చేకూర్చినట్లైంది.


కుంభకోణం ఆపత్ సహాయేశ్వరాలయం

అపోలో ఆస్పత్రిలో అరుదైన చికిత్సా కేంద్రం
ఒకేచోట న్యూరో, ఈఎన్‌టీ చికిత్సలు


చికిత్సా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అపోలో గ్రూపు వైస్ చైర్‌పర్సన్ ప్రీతారెడ్డి

చెన్నై, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రీమ్స్‌రోడ్డులోని అపోలో ఆస్పత్రిలోని అపోలో ఒన్ సెంటర్‌లో ఇంటిగ్రేటెడ్ న్యూరో-ఈఎన్‌టీ వెర్టిగో అండ్ బ్యాలెన్స్ డిసార్డర్స్ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నట్లు అపోలో గ్రూపు వైస్‌చైర్ పర్సన్ ప్రీతారెడ్డి తెలిపారు. ఆ ఆస్పత్రిలో శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటైన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ కొత్త చికిత్సా కేంద్రంలో నరాల వ్యాధి చికిత్స నిపుణులు, ఈఎన్‌టీ వైద్యులు, మూర్ఛ వ్యాధి వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీలలో నుంగంబాక్కంలోని స్టార్ హోటల్‌లో చెన్నై వెర్టిగో సమ్మిట్-2024 పేరిట సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. మీడియా సమావేశంలో వివిధ విభాగాల వైద్య నిపుణులు డాక్టర్ కార్తీక్ మాదేష్, డాక్టర్ విజయ్ శంకర్, డాక్టర్ వెంకట్ కార్తికేయన్, డాక్టర్ మైఖేల్ స్త్రప్, డాక్టర్ అరుల్‌సెల్వన్, డాక్టర్ ప్రభాష్ ప్రభాకరన్, అపోలో హాస్పిటల్స్ రీజినల్ సీఈఓ నవీన్, మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ ఆర్కే వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

కావేరి హాస్పిటల్‌లో
76 యేళ్ల టీచర్‌కు రెండు శస్త్రచికిత్సలు

చెన్నై, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్‌లో మైలాడుదురైకి చెందిన 76 యేళ్ల రిటైర్డ్ టీచర్‌కు హైబ్రిడ్ ఆపరేటింగ్ రూమ్‌లో ఒకే సమయంలో గుండె కవాటం అమరిక, తుంటి ఎముక మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆ హాస్పిటల్ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆర్.అనంతరామన్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆ టీచర్‌కు కొన్నేళ క్రితం గుండెలో అమర్చిన కృత్రిమ కవాటం చెడిపోవటంతో చికిత్స కోసం వచ్చారని, అదే సమయంలో ఆయన తుంటి ఎముక కూడా దెబ్బతిన్నదని, ఈ నేపథ్యంలో రెండు శస్త్రచికిత్సలు చేయాల్సి వచ్చిందన్నారు. ఈ రెండు శస్త్రచికిత్సలు జరిపేందుకు సుమారు మూడు గంటలు పట్టిందన్నారు. మీడియా సమావేశంలో హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్‌కుమార్, ఆర్థోపెడిక్స్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ ముకుంద్ తదితరులు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో శస్త్రచికిత్సల వివరాలను వెల్లడిస్తున్న సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆర్.అనంతరామన్, వైద్యనిపుణులు



శుక్రవారం వేకువజాము నుంచే పంచమి వేడుకలు తిరుచానూరులో మొదలయ్యాయి. పద్మావతీ అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాల అనంతరం పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు సన్నిధి ముఖమండపంలో చూర్ణాభిషేకం, ఆస్థానం నిర్వహించారు. అనంతరం అమ్మవారు, చక్రత్తాళ్వార్లను వేంచేపుగా పద్మసరోవరం పంచమీతీర్థ మండపంలో కొలువుదీర్చారు. సరిగ్గా10.35 గంటలకు తిరుమల నుంచి శ్రీవారు పంపిన సారె ఈ మండపానికి చేరుకుంది. అనంతరం ముత్తైదువ సారెతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 12.20 గంటలకు అభిజిత్ లగ్నం శుభ గడియల్లో పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా చక్రత్తాళ్వార్‌ను పుష్కరిణిలో అర్చకులు మూడుసార్లు మునక వేయించారు.ఇదే సమయంలో అశేష భక్త జనం 'శ్రీ పద్మావతీ పాహిమాం, గోవిందా... గోవింద' అంటూ పుష్కరిణిలో మునకలేశారు. కాగా పొద్దుపోయే వరకూ సుమారు లక్ష మంది వరకు పుణ్యస్నానాలు ఆచరించినట్లు టీటీడీ అంచనా.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

భక్తజనసాగరం

వేడుకగా పంచమీతీర్థం

పద్మావతికి 1.11 కోట్ల పుట్టినరోజు కానుకలు

పుట్టినరోజున పద్మావతమ్మకు శ్రీనివాసుడు ఈ ఏడాది వజ్రాభరణాలను కానుకగా పంపడం విశేషం. తిరుమల నుంచి పాండియన్ కిరీటం, వజ్రాల లక్ష్మీపతకం, హారం, గాజులు, జత కమ్మలు అందాయి. వీటి విలువ రూ.1.11 కోట్లు. ప్రతియేటా చక్రస్నానం రోజున శ్రీవారు ఆభరణాలను పంపించడం ఆనవాయితీ. వీటిని పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి అలంకరించారు.







అదానీతో స్టాలిన్ భేటీ అవాస్తవం

● మంత్రి సెంథిల్ బాలాజీ

చెన్నై, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్త అదానీతో రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ రహస్యంగా సమావేశమయ్యారని, సోలార్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి ఆయనతో ఒప్పందం కుదుర్చుకున్నారని పీఎంకే నేత అన్బుమణి, బీజేపీ నేత అన్నామలై చేస్తున్న ఆరోపణలను విద్యుత్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ తీవ్రంగా ఖండించారు. అదే పనిగా అదానీతో స్టాలిన్ భేటీ అయినట్లు తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు చేపడతానని కూడా ఆయన హెచ్చరించారు. అన్నాడీఎంకే పదేళ్ల పాలనలో అధ్వాన్నంగా మారిన విద్యుత్ బోర్డును మూడేళ్లలో చక్కదిద్దిన ఘనత స్టాలిన్‌కు దక్కుతుందని ఆయన తెలిపారు.

కళాశాలల్లో మౌలిక వసతులకు రూ.152 కోట్లు

పెరంబూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో మౌలికవసతుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.152 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ మంత్రి కేవీ చెళియన్ విడుదల చేసిన ప్రకటనలో... ప్రభుత్వ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు 2022 నుంచి ఐదు సంవత్సరాలకు రూ.1,000 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో, ప్రస్తుత విద్యా సంవత్సరంలో 31 ఆర్ట్స్ కళాశాలలు, 12 పాలిటెక్నిక్ కళాశాలలు, ఆరు ఇంజనీరింగ్ కళాశాలల్లో ల్యాబ్‌లు, అదనపు తరగతి గదులు సహా మౌలిక వసతుల ఏర్పాటుకు రూ.152.97 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు.

విద్యార్థులకు మత్తు మాత్రల సరఫరా

● ఇద్దరు రౌడీల అరెస్టు

అడయార్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముంబై, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి గంజాయి, మత్తుమాత్రలను అక్రమంగా తీసుకొచ్చి విద్యార్థులకు సరఫరా చేసిన కేసులో పోలీసులు ఇద్దరు రౌడీలను అరెస్టు చేశారు. వీరిని రెడ్‌హిల్స్ మేట్టుకుప్పం ప్రాంతానికి చెందిన రౌడీ దీనా (24), విరుగంబాక్కంకు చెందిన తిరునావుక్కరసు (23)లుగా గుర్తించారు. వీరి నుంచి 300 మత్తుమాత్రలు, 200 గ్రాములు గంజాయి, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత వీరిద్దరినీ ఎగ్మోర్ కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

రైలు ఢీకొని మహిళా ఎస్ఐ మృతి

అడయార్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కందికుప్పం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ (స్పెషల్)గా పనిచేసే మేరీస్ స్టెల్లా (50) రైలు ఢీకొని దుర్మరణం పాలయ్యారు. శుక్రవారం ఉదయం కోర్టు విధుల కోసం మద్రాస్ హైకోర్టుకు వచ్చేందుకు కందికుప్పం నుంచి తిరుపత్తూరు జిల్లా వాణియంబాడికి బస్సులో వచ్చారు. అక్కడ నుంచి చెన్నై చేరుకునేందుకు ఏలగిరి ఎక్స్‌ప్రెస్ ఎక్కాలని భావించి, పట్టాలు దాటుతున్నారు. ఆ సమయంలో ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయారు. సమాచారం అందుకున్న జోలార్‌పేట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్టెల్లాకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు.

నగరానికి చేరుకున్న 8 మంది జాలర్లు

ఐసిఎఫ్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైళ్లలో ఉన్న 8 మంది ఖైదీలు కోర్టు ఉత్తర్వులతో విడుదలై శుక్రవారం వేకువజామున నగరానికి చేరుకున్నారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లిన రామనాథపురం, రామేశ్వరం, పుదుకోట ప్రాంతాలకు చెందిన 8 మంది జాలర్లను జూన్ 26, జూలై 1, 11వ తేదీల్లో అరెస్ట్ చేసిన శ్రీలంక నావికాదళం వారిని కోర్టులో హాజరుపరచి జైళ్లకు తరలించింది. శ్రీలంక అరెస్ట్ చేసిన జాలర్లను విడిపించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ ఇటీవల కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రికి లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో శ్రీలంక జైళ్లలో ఉన్న 8 మంది జాలర్లను విడుదల చేస్తూ ఆ దేశ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. జాలర్లను శ్రీలంకలోని భారత దౌత్య కార్యాలయ అధికారులకు అప్పగించారు. కొలంబో నుంచి 8 మంది జాలర్లు విమానంలో శుక్రవారం నగరానికి చేరుకున్నారు. వారిని ఆహ్వానించిన మత్స్యశాఖ అధికారులు, ప్రత్యేక వాహనాల్లో వారి వారి స్వగ్రామాలకు పంపించారు.

రూ.50 కోట్లతో మదురై వండియూరు సుందరం పార్కు ఆధునికీకరణ

● ప్రత్యేక ఆకర్షణగా సైకిల్ ట్రాక్



సుందరం పార్కు వద్ద నిర్మిస్తున్న సైక్లింగ్ ట్రాక్

టి.నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మదురై వండియూరు కణ్‌మాయ్ సుందరం పార్కులో సైక్లింగ్ ట్రాక్ నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. మదురై నగరం నడిబొడ్డున 550 ఎకరాల్లో సముద్రాన్ని తలపించేలా వండియూరు కణ్‌మాయ్ ఉంది. ఈ కణ్‌మాయ్ (వాగు)కు ప్రజాపనుల శాఖ పూడిక తీయించపోవడంతో ఆ వాగు విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో మదురై కార్పొరేషన్ అధికారులు కణ్‌మాయ్‌లో పూడిక తీసి, లోతు పెంచి కరకట్టలను పటిష్ఠం చేశారు. అంతే కాకుండా ఆ కణ్‌మాయ్ ఒడ్డున ఉన్న సుందరం పార్కు ప్రాంతాన్ని రూ.50 కోట్లతో ఉద్యానవనంగా మార్చే సరికొత్త ప్రాజెక్టు అమలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో కణ్‌మాయ్ కరకట్టలను మరింత పటిష్ఠం చేయడం, బోట్ సవారీ, కణ్‌మాయ్‌కి పడమర, ఉత్తర దిశల్లో సైకిల్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, యోగా, ధ్యానకేంద్రం, మినీ క్యాంటీన్, మినీ లైబ్రరీ, చిన్నారులు, వృద్ధులకు క్రీడా ఉపకరణాలు, ఫౌంటెన్, స్కేటింగ్ సైట్, కరాటే ట్రైనింగ్ సెంటర్, వాలీబాల్ మైదానం, పార్కింగ్, మరుగుదొడ్డు, మురుగునీటి శుద్ధీకరణ కేంద్రం, మినీ ఫ్లవర్ పార్కుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో లేని అంశం. పార్కు ప్రాంగణంలోనే 3. కి.మీల పొడవునా సైక్లింగ్ ట్రాక్ నిర్మిస్తున్నారు. వాకింగ్‌కు వచ్చేవారు అక్కడున్న సైకిళ్లను ఉచితంగా నడిపే సదుపాయం కల్పించనున్నారు. దీని కోసం సైక్లింగ్ సెంటర్‌లో 20 సైకిళ్లు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంచుతారు. ఇంటి నుంచి సైకిళ్లను తెచ్చుకునేవారు కూడా సైక్లింగ్ ట్రాక్‌లో వాటిని నడుపుకునే వెసలుబాటు కల్పిస్తారు. సుందరం పార్కు ప్రవేశద్వారంలో ఈ సైక్లింగ్ ట్రాక్ ప్రారంభమవుతుంది. అన్నానగర్ వైపు కిలోమీటరు, మాట్టుతావాని వైపు 2 కిలోమీటర్ల చొప్పున మొత్తం మూడుకిలోమీటర్ల మేర ఆ వాగునీటిని తిలకిస్తూ సైకిళ్లను నడుపుకుంటూ వెళితే వింత అనుభూతి కలుగుతుందని మదురై మహానగర కార్పొరేషన్ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ పార్కును సందర్శకుల దేహారోగ్యాన్ని పెంచేలా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నామని చెప్పారు. మదురై నగర వాసులు ఇప్పటివరకూ వినోదం కోసం సినిమాథియేటర్లకు వెళ్తున్నారని, ఇకపై ఈ సుందరం పార్కు మరింత వినోదాలను అందించనున్నదని వివరించారు. ఈ పార్కు వద్ద పాదచారుల కోసమే మూడు కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్ కూడా నిర్మించినట్లు తెలిపారు.

రాజ్యాంగ శిల్పికి రాష్ట్రవ్యాప్తంగా నివాళి

ప్యారీస్, డిసెంబర్ 6, (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ రూప శిల్పి డా. బాబా సాహెబ్ అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పలువురు నివాళులర్పించారు. హార్బర్ నియోజకవర్గంలో పోర్టు ట్రస్ట్ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి చెన్నై పోర్టు ట్రస్ట్ కమీషనర్, వైస్ చైర్మెన్ ఎస్ విశ్వనాథన్, కార్మికులు పూల దండలు సమర్పించి నివాళులు అర్పించారు. కొడుంగైయూర్ చిన్నాండి మఠంలోని అంబేడ్కర్ గ్రహానికి 'జనని సాంస్కృతిక సంస్థ' ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, యర్రబనేని పట్టాభిరామయ్య, దాసం రాజేంద్ర ప్రసాద్, వంజరపు శివయ్య తదితరులు పూల దండలు సమర్పించి నివాళులర్పించారు. సెంట్రల్ రైల్వే స్టేషన్ సమీపం పెరియమెట్టులో అంబేడ్కర్ విగ్రహానికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) తమిళనాడు అధ్యక్షుడు లోకేష్ కుమార్ నేతృత్వంలో, వసంతరావు, వేణుగోపాల్, ఆరోగ్యదాస్ పూలదండలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షులు సెల్వపెరుంతగై, మాజీ అధ్యక్షులు తిరునావుక్కరసర్, తంగబాలు తదితరులు కోయంబేడులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలోని తైలవరం గార్డెన్‌లో పీఎంకే వ్యవస్థాపకులు డా. రాందాస్, స్థానిక అల్వార్ పేటలోని తమిళ మానిల కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షులు జీకే వాసు, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు డా. తమిలిసై సౌందర్యరాజన్, సినీ నటుడు విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కలగం (టీవీకే) ఉత్తర చెన్నై జిల్లా అధ్యక్షుడు సురా వేలు, కార్యదర్శి రాజేష్ తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.



అంబేడ్కర్‌కు చెన్నై పోర్టు ట్రస్ట్ కమిషనర్, వైస్ చైర్మెన్ ఎస్.విశ్వనాథన్ తదితరుల నివాళి



కొడుంగైయూర్ చిన్నాండి మఠంలోని అంబేడ్కర్ విగ్రహానికి గుడిమెట్ల చెన్నయ్య తదితరుల నివాళి



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ అధ్యక్షుడు అన్నామలై



అంబేడ్కర్‌కు రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షురాలు తమిళిసై నివాళి





పెరియమెట్టులో అంబేడ్కర్‌కు ఎమ్మార్పీఎస్ తమిళనాడు అధ్యక్షుడు లోకేష్ కుమార్ బృందం నివాళి - సినీ నటుడు విజయ్ సారథ్యంలోని టీవీకే నేతల నివాళి

మండుతున్న వంట నూనె ధరలు

● రెండు నెలల్లో రూ.40కి పెరిగిన వైనం



ఐసిఎఫ్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వంట నూనె ధరలు పెరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆహార వంటకాల్లో వంట నూనె ప్రధానమైనది. దేశ అవసరాలకు మలేసియా నుంచి నూనె అధికంగా దిగుమతి అవుతోంది. ఈ క్రమంలో, ఇటీవల కేంద్ర ప్రభుత్వం విదేశీ దిగుమతులపై పన్ను పెంచింది. ఈ క్రమంలో, దీపావళి ముందు నూనె కిలో రూ.110 ఉండగా, దీపావళి సమయంలో రూ.20 పెరిగి రూ.130 ధర పలికింది. పండుగ తర్వాత ధర తగ్గుతుందని ఆశించినా, అందుకు భిన్నంగా మరో రూ.20 పెరిగి రూ.150కి విక్రయమవుతోంది. ఆ ప్రకారం, రెండు నెలల్లో వంట నూనె కిలో రూ.40 వరకు పెరిగింది. కేంద్ర ప్రభుత్వ విదేశీ దిగుమతులపై పన్ను పెంచడం ఈ ధరల పెంపుకు కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు. ధరల పెంపుతో తమపై అదనపు భారం పడిందని సామాన్య, మధ్యతరగతి ప్రజలు వాపోతున్నారు.

9 నుంచి విల్లివాక్కం శ్మశానవాటిక మూసివేత

ఐసిఎఫ్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ మండల పరిధిలోని 94వ వార్డులో విల్లివాక్కం శ్మశానవాటిక ఈ నెల 9 నుంచి 28వ తేది వరకు మూసివేయనున్నారు. మరమ్మతుల కారణంగా శ్మశాన వాటిక మూసివేయనున్నామని, ఈ సమయంలో ప్రజలు వేలంగాడు, అరుంబాక్కం శ్మశానవాటికలు వినియోగించుకోవాలని కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలియజేసింది.

బస్సు ఢీకొని ఇద్దరు విద్యార్థుల మృతి

ఐసిఎఫ్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లాలో బస్సు ఢీకొని ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు... రాశిపురం పుదుపాళయానికి చెందిన రాహుల్ (20) అడంగలూరులోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో చదువుతున్నాడు. సేందమంగళంకు చెందిన పూన్‌తమిళ్ (20) తిరుసెంకోటలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వీరిద్దరు గురువారం ఉదయం ద్విచక్రవాహనంలో కాలేజీలకు బయల్దేరారు. ఎలచ్చిపాళయం సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న ఓ బస్సు ఢీకొంది. దీంతో ఇద్దరూ సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.